నూలు డిపో సిరిసిల్లలో ఏర్పాటు చేయాలి

- తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ డిమాండ్

సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్

రాజన్న సిరిసిల్ల, (నమస్తే తెలంగాణ)/కలెక్టరేట్, అక్టోబర్ 6 : వస్త్ర పరిశ్రమకు వినియోగించే నూలు డిపోను సిరిసిల్లలో ఏర్పాటు చేయాలని తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఆదివారం బీవైనగర్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ మాట్లాడుతూ, యారన్ డిపోను మంజూరు చేయడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పవర్‌లూం పరిశ్రమలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, నేతన్నలకు ఉపాధి కల్పించాలని కోరుతూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్, ఆసాములు, యజమానులంతా కలిసి జేఏసీ ఆధ్వర్యంలో చేసిన పోరాటాల ఫలితంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్లలో ఒక్కటైన యారన్ డిపోను మంజూరు చేశారన్నారు. అందుకు కృషి చేసిన విప్ ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వస్త్ర పరిశ్రమకు సంబంధించిన సాంచాలు రాష్ట్రంలోనే అత్యధికశాతం సిరిసిల్ల పట్టణంలో ఉన్నాయన్నారు. తెలంగాణకే తలమానికంగా ఉన్న సిరిసిల్ల పరిశ్రమకు అనుబంధంగా యారన్ డిపో సిరిసిల్లలో ఏర్పాటు చేస్తే అందరికీ అనువుగా ఉంటుందన్నారు. ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుని నేత కార్మికులు, వస్త్ర ఉత్పత్తి దారులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని కోరారు. యారన్ డిపో వల్ల ఉత్పత్తి దారులకు కొంత పెట్టుబడి భారం తగ్గి ఆసాములు, యజమానులకు లబ్ధి చేకూరుతుందన్నారు. కార్మికులకు శాశ్వత ఉపాధి కల్పించే వర్క్ టూ ఓనర్ పథకాన్ని వెంటనే ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కోడం రమణ, నక్క దేవదాస్, సిరిమల్ల సత్యం, ఉడుత రవి, బెజుగం సురేశ్, బింగి సంపత్, స్వర్గం శేఖర్, సందుపట్ల పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్ మందిర నిర్మాణ పనులకు శంకుస్థాపన

భూమి పూజ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి దంపతులు

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 6: తంగళ్లపల్లి మండలం నేరెళ్లలో ఆదివారం అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఇస్కాన్ మందిర నిర్మాణానికి భూమి పూజ మహోత్సవం వైభవంగా జరిగింది. ఇస్కాన్ మందిర నిర్మాణ పనులకు ఇస్కాన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు భూమి పూజ చేసి, శంకుస్థాపన చేశారు. హోమ యజ్ఞాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో సిరిసిల్ల సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, చక్రపాణి, ఏఎంసీ చైర్ పర్సన్ వెలుముల స్వరూప తిరుపతిరెడ్డి, టీఎస్‌పీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, మంగళారపు ప్రభాకర్, కోడం అశోక్, దార్నం లక్ష్మినారాయణ, మ్యాన రవి, అడ్డగట్ల మురళి, బొల్లి రామ్మోహన్, అన్నారం శ్రీనివాస్, బొబ్బుల మల్లేశం, దార్ల సందీప్, చేపూరి నాగరాజు, తదితరులున్నారు.

బీజేపీలో కోల్డ్‌వార్ !

- వికాస్ కార్యక్రమాలకు జిల్లా అధ్యక్షుడి డుమ్మా
- అంతర్గతంగా నలిగిపోతున్న కార్యకర్తలు

వేములవాడ, అక్టోబర్ 6: జిల్లా బీజేపీ పార్టీలో కోల్డ్‌వార్ కొనసాగుతోంది. జిల్లాలో వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాలు ప్రధానంగా ఉండగా పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, వేములవాడ గత అసెంబ్లీ ఎన్నికల బీజేపీ అభ్యర్థి చెన్నమనేని వికాస్ మధ్య కోల్డ్ వార్ నడుస్తున్నట్లుగా తెలుస్తోంది. గడిచిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు తనయుడు చెన్నమనేని వికాస్‌కే టికెట్ ఇవ్వాలని రాష్ట్ర అధిష్టానం వద్ద ఆందోళన నిర్వహించి టికెట్ సాధించిన రామకృష్ణ ప్రస్తుతం ఆయన కార్యక్రమాలకు దూరంగా ఉండడం చర్చనీయాంశంగా మారింది. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తుండగా వికాస్ మండలాల వారీగా తిరుగుతూ సభలు నిర్వహించి పార్టీ సభ్యత్వ నమోదును చేస్తున్నారు. అయితే చెన్నమనేని వికాస్ ఇప్పటికే నియోజకవర్గంలోని కోనరావుపేట, చందుర్తి, మున్సిపల్ పరిధిలోని నాంపల్లి, ఆదివారం చెక్కపల్లిలో నిర్వహించిన సభ్యత్వ నమోదు సభలు నిర్వహించారు. అయితే ఈ సమావేశాలకు రామకృష్ణ హాజరు కాకపోవడం పార్టీలో చేర్చని అంశంగా మారింది. మరోవైపు జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉన్న రామకృష్ణ సభ్యత్వ నమోదును మండలాల వారీగా అధ్యక్షులతో చేయిస్తున్నప్పటికీ వికాస్‌రావు సభలో పాల్గొనకపోవడం, మండల పార్టీల బాధ్యులు, గ్రామ కమిటీల నాయకులు నలిగిపోతున్నారు. ఒకరు జిల్లా పార్టీ బాధ్యులుగా ఉండగా మరొక నియోజకవర్గం అభ్యర్థిగా ఉన్న తరుణంలో ఎవరి వైపున ఉండాలో తెలియక సతమతమవుతుండగా పార్టీలో గందరగోళానికి తెరతీసింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పార్లమెంట్ పరిధి వేములవాడ నియోజకవర్గంలో బీజేపీలో జరుగుతున్న కోల్డ్‌వార్ రాజకీయ ఆసక్తిని కలిగిస్తూ చర్చనీయాంశంగా మారింది.

సాంచాలు ఇక్కడ .. నూలు డిపో అక్కడా..

- ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు భారమంటున్న వస్త్ర వ్యాపారులు

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : నూలు డిపో ఏర్పాటు కావాలన్న ఆకాంక్షను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చినప్పటికీ వస్త్ర వ్యాపారుల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నది. వేలాది సాంచాలున్న కార్మిక క్షేత్రంలో ఏర్పాటు చేయాల్సిన నూలు డిపోను సాంచాల సప్పుళ్లే లేని ధార్మిక క్షేత్రంలో నెలకొల్పడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. వస్త్ర పరిశ్రమ అభివృద్ధి చెందాలంటే నూలు డిపో స్థానికంగా ఉండాలని వస్త్ర ఉత్పత్తిదారుల అభిప్రాయం. దశాబ్దాల కాలంగా వస్త్ర ఉత్పత్తికి వినియోగించే నూలును గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి టన్నుల కొద్దీ కొనుగోలు చేసి సిరిసిల్లకు తీసుకువస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి నూలు రావడం వల్ల రవాణా చార్జీలు భారమై పోవడం, పైగా సమయానికి అందక వస్త్ర ఉత్పత్తి దారులు ఇబ్బంది పడుతున్నారు. ఇబ్బందులు తీరాలంటే నూలు డిపో సిరిసిల్లలో ఏర్పాటు చేయాలంటూ పదేళ్లుగా ప్రభుత్వాలకు కోరుతూ వస్తున్నారు. ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రభుత్వం నూలు డిపోను మంజూరి చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. నూలు డిపో మంజూరైందన్న సంతోషం కన్నా అందుబాటులో ఏర్పాటు చేయకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూలు కోసం పెద్దఎత్తున పెట్టుబడి లేనందున స్థానికంగా డిపో ఉన్నట్లయితే అవసరాన్ని బట్టి కొనుగోలు చేసేందుకు అవకాశం ఉంటుంది. అందుకనే సిరిసిల్లలో ఏర్పాటు చేయాలని వ్యాపారులు కోరితే ప్రభుత్వం మాత్రం వేములవాడలో ఏర్పాటు చేయడం సరైంది కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కార్మిక క్షేత్రమైన సిరిసిల్లలో టెక్స్‌టైల్స్‌పార్కు, అప్పారెల్ పార్కులో అనేక షెడ్లు ఖాళీగా ఉన్నాయి. అందులో నూలు డిపో ఏర్పాటు చేయవచ్చు. కాగా చేనేత జౌళిశాఖ కార్యాలయం సిరిసిల్లలోనే ఉంది. డిపోకు అనుసంధానంగా పనిచేసేది జౌళిశాఖనే. నూలుకు సంబంధించిన లెక్కలు చూసుకోవాల్సింది కూడ జౌళిశాఖ అధికారులే. నూలు డిపోకు కొత్తగా స్థలం కేటాయించాల్సిన అవసరం కూడా లేదు. పుణ్యక్షేత్రమైన వేములవాడలో స్థలం కేటాయించడంతోపాటు షెడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. అది ఖర్చుతో కూడుకున్నది. పైగా సిరిసిల్ల వస్త్ర వ్యాపారులకు ఏమాత్రం ప్రయోజనకరంగా ఉండదంటున్నారు. సిరిసిల్ల పట్టణంతోపాటు సారంపల్లిలోని టెక్స్‌టైల్స్ పార్కు, పెద్దూరులోని అప్పారెల్ పార్కులోని వేలాది సాంచాలకు వినియోగించే నూలు కొత్తగా ఏర్పాటు చేస్తున్న డిపో నుంచే కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. సాంచాలున్నచోట కాకుండా మరోచోట ఏర్పాటు చేయడం ఎంత వరకు సమంజసమని వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. జిల్లాకు మంజూరి చేసిన నూలు డిపోను సిరిసిల్లలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

బలవంతపు వసూళ్లు నిలిపి వేయాలి

- మైక్రోఫైనాన్స్‌ను హెచ్చరించిన ఐద్వా

మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి

రాజన్న సిరిసిల్ల (నమస్తే తెలంగాణ)/కలెక్టరేట్, అక్టోబర్ 6 : మైక్రో, షేర్‌ములా, బంధన్ బ్యాంకులు నేత కార్మికుల నుంచి బలవంతపు వసూళ్లు నిలిపి వేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. మైక్రోఫైనాన్స్ సిబ్బంది పేదలపై అనుసరిస్తున్న దౌర్జన్యాలను ప్రభుత్వం అరికట్టాలని కోరారు. సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్‌లోని ఆర్ఎంపీ భవన్‌లో ఆదివారం జరిగిన ఐద్వా జిల్లా మహాసభలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో ఉపాధి లేక నేతన్నలు మైక్రో ఫైనాన్స్‌ను ఆశ్రయించి రుణాలు తీసుకున్నారని తెలిపారు. తీసుకున్న రుణాలు కట్టలేని స్థితిలో ఉన్న కార్మికులను అధిక వడ్డీతో పాటు బలవంతంగా వసూలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నందున కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికులు, పేదలు ప్రైవేటు మైక్రో, బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను రద్దు చేయాలని అందుకు ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలన్నారు. వస్త్ర పరిశ్రమ తిరిగి ప్రారంభమయ్యే వరకు నేత కార్మికుల నుంచి రుణాలు వసూలు చేయడం ఆపేయాలని, బలవంతపు వసూలు చేస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. మహిళల ఉపాధి కల్పించేలా జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. బెల్టుషాపులు రద్దుచేసి మహిళలకు రక్షణ కల్పించాలన్నారు.

నూతన కమిటీ

మహాసభల సందర్భంగా ఐద్వా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా సూరం పద్మ, ప్రధాన కార్యదర్శిగా జవ్వాది విమల, ఉపాధ్యక్షురాలిగా పూజ్యం జనదేవ లక్ష్మి, ఎండీ రెహమాన, డాకూరి కల్పన, పూజ, సహాయ కార్యదర్శిగా సామల కవిత, వడ్ల లక్ష్మి, బోనాల లక్ష్మికి బాధ్యతలు అప్పగించారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నాగుల సత్యనారాయణ

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నాగుల సత్యనారాయణ గౌడ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సిరిసిల్ల పట్టణానికి చెందిన నాగుల సత్యనారాయణ గౌడ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడిగా, సిరిసిల్ల సహకార విద్యుత్ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా పార్టీకి విస్తృత సేవలందించారు. ఆయనకు గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి దక్కడంపై ఏఎంసీ చైర్‌పర్సన్ వెలుముల స్వరూప తిరుపతిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు కాముని వనితనళినీకాంత్, బూట్ల మోహన్ హర్షం వ్యక్తం చేశారు.

ఉచిత వైద్య శిబిరం

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 6: తెలంగాణ హాస్పిటల్స్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్(తానా), మానేరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఆదివారం జర్నలిస్టులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ, తానా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. మానేరు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చింతోజు భాస్కర్ మాట్లాడుతూ, ప్రభుత్వ దవాఖానలో ఎంఆర్ఐ స్కానింగ్ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. ఇక్కడ అశ్విని హాస్పిటల్స్ చైర్మన్ సత్యనారాయణస్వామి, వైద్యులు అభినయగోవర్ధన్, రవికిరణ్, రాపెల్లి రమేశ్, మురళీకృష్ణ, సిరిసిల్ల ఏరియా దవాఖాన డిప్యూటీ సూపరింటెండెంట్ సంతోష్ కుమార్, మానేరు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చింతోజు భాస్కర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఆకుల జయంత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పరకాల ప్రవీణ్‌కుమార్, కాయితి మహేందర్, తడుక విశ్వనాథం, టీవీ నారాయణ, కాశీనాథ్, ప్రసాద్‌రెడ్డి, పాలమాకుల శేఖర్, చింతకింది శ్యాం, నాయిని బాబు, పరశురాములు, రాపెల్లి భాస్కర్, తదితరులున్నారు.

శ్రీచైతన్యలో ఆర్ఎస్ఎస్ శిక్షణ

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 6: మండల కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాలలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో కరసేవకుల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆదివారం నైతిక జీవన విధానంపై విద్యార్థులు, యువకులకు పలువురు వక్తలు అవగాహన కల్పించారు. ఈ నెల 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు శిక్షణ తరగతులుంటాయని పాల్గొన్న వారు తెలిపారు.

యారన్ సబ్సిడీని విడుదల చేయాలి

కలెక్టరేట్, అక్టోబర్ 6: ప్రభుత్వం నుంచి వస్త్ర పరిశ్రమ కార్మికులకు రావాల్సిన పదిశాతం యారన్ సబ్సిడీని వెంటనే విడుదల చేయాలని లాల్ బహుట చేనేత, పవర్‌లూమ్ కార్మిక సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డిని కోరారు. ఆదివారం ఆయనను కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు అద్య వేణు, పంతం రవి ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఇక్కడ దూస రమేశ్, మోర మోహన్, కాంగ్రెస్ నాయకులు కత్తెర దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

చందుర్తి, అక్టోబర్ 6:చందుర్తి ప్రీమియం లీగ్ సీజన్ 2 క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభమైంది, ఈ సందర్భంగా మండలంలోని క్రీడాకారులు ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్ టోర్నమెంట్లో పాల్గొన్నారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణకు మూడపల్లి గ్రామానికి చెందిన బద్దం తిరుమల్ రెడ్డి టోర్నమెంట్ విజేత జట్లకు షీల్డ్, మెమెంటోలు అందించనున్నారు. ఇక్కడ క్రికెట్ క్రీడాకారులు పు ల్కం మధు, యాకూబ్, మొకేలే విజయేందర్, అక్షయ్, భాస్కర్, తిరుపతి తదితరులున్నారు.

దొరక్కుండా వెళ్దామనుకుని..

- ఇసుక పికప్ వాహనం బోల్తా
- ఒకరి పరిస్థితి విషమం

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 6: పోలీసుల కళ్లుగప్పి అక్రమంగా ఇసుక లోడుతో ఉన్న ఒక పికప్ వాహనం వేగంగా వెళ్తూ బోల్తా పడగా డ్రైవర్‌కు తీవ్రగాయాలైన ఘటన ఆదివారం జరిగింది. ఇల్లంతకుంట మండలం గాలిపల్లికి చెందిన అల్లె శ్రీను ఇసుక లోడుతో ఉన్న పికప్ వాహనాన్ని పోలీసుల కళ్లుగప్పి పదిర నుంచి నారాయణపూర్ మీదుగా తీసుకెళ్తున్న క్రమంలో నారాయణపూర్ శివారులో బోల్తాపడింది. శ్రీనుకు తీవ్రగాయాలై పరిస్థితి విషమంగా మారడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కోనరావుపేట, అక్టోబర్ 6: మండలంలోని మల్కపేట గ్రామంలో బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు ఉత్తెమ్ శ్రీనివాస్ తల్లి నర్సవ్వ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ సీనియర్ నేత ఏనుగు మనోహర్‌రెడ్డి పరామర్శించారు. ఇక్కడ మాజీ సర్పంచ్ ఆరె లత మహేందర్, మాజీ ఉపసర్పంచ్ జవ్వాజి అంజయ్యగౌడ్, జవ్వాజి దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331783-All

DASARA OFFER

★Invest 15 Lakhs and get Monthly Income 10,000/- for more details Contact: Dr. Financial Consultants. 8106826332, 9391665516.
NT-333073

పాస్ పోర్ట్ పోయినది

నేను పన్యాల రాజిరెడ్డి తండ్రి:హన్మంతరెడ్డి గ్రామం. రామన్నపల్లె మండలం తంగళ్ళపల్లి నాయొక్క ఇ-6709720 నెంబర్ గల పాస్ పోర్ట్ రామన్న పల్లె నుండి సిరిసిల్ల బస్టాండ్ కు బైకు పై వెళుతుండగా ఎక్కడో పడిపోయింది. దొరికిన వారు సంప్రదించగలరు.
సెల్ : 9908062659

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

రాజన్నపేటలో లైట్లు వెలిగినయ్

నమస్తే ఎఫెక్ట్

రాజన్నపేటలో వెలుగుతున్న వీధి దీపాలు

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 6: ఎంగిలి బతుకమ్మల సందడి నెలకొన్న నేపథ్యంలో రాజన్నపేటలోని ఎనిమిదో వార్డులో వీధి దీపాలు కొన్ని రోజులుగా వెలుగక అంధకారం అలుముకున్న నేపథ్యంలో నమస్తే తెలంగాణలో ఆదివారం 'రాజన్నపేటలో అంధకారం' పేరిట నమస్తే తెలంగాణలో కథనం ప్రచురితమైన సందర్భంగా అధికారులు స్పందించారు. వార్డులోని వీధిలైట్లను బిగించి సాయంత్రం వెలిగించడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

వాలీబాల్ విజేత మామిడిపల్లి

కోనరావుపేట, అక్టోబర్ 6: నిజామాబాద్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా యూత్ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన వాలీబాల్ జట్లు పాల్గొనగా మామిడిపల్లి, సుద్దాల జట్లు ఫైనల్ పోరులో తలపడ్డాయి. రసవత్తరంగా సాగిన ఈ మ్యాచ్‌లో మామిడిపల్లి జట్టు విజేతగా నిలిచి ప్రథమ స్థానంలో నిలువగా, సుద్దాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. మామిడిపల్లి జట్టుకు కప్‌తోపాటు రూ.10వేల నగదు, సుద్దాల జట్టుకు కప్‌తో పాటు రూ.5వేల నగదును టోర్నీ నిర్వాహకులు అందజేశారు. గెలుపొందిన జట్టు క్రీడాకారులును పలువురు నేతలు అభినందించారు. ఇక్కడ టోర్నీ నిర్వాహకులు, మెగా యూత్ సభ్యులు తాళ్లపల్లి మధు, దుర్గం మహేశ్, ముష్ణం శ్రీకాంత్, దుర్గం వినీత్, బాలసాని నితీశ్, పాలకుర్తి వాసు, దుర్గం శ్రీనివాస్, పెరుగు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

బ్లూ కోల్ట్ సిబ్బందిపై దాడి

వీర్నపల్లి, అక్టోబర్ 6: మండలంలోని జవహర్‌నాయక్ తండాలో బ్లూ కోల్ట్ సిబ్బందిపై మద్యం మత్తులో ఓ వ్యక్తి దాడి చేశాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన ఒక గిరిజన మహిళ తన భర్త మద్యం తాగి తీవ్రంగా కొడుతున్నాడంటూ పోలీసులకు సమాచారం అందించింది. దీంతో బ్లూ కోల్ట్ కానిస్టేబుల్ నయీం, హోంగార్డు క్రాంతి అక్కడికి చేరుకొని గొడవను అపే ప్రయత్నం చేశారు. కాగా, మద్యం మత్తులో ఉన్న గుగులోత్ రవినాయక్ నా భార్యను కొట్టుకుంటా.. చంపుకుంటా అడగడానికి మీరెవరంటూ వీడియో రికార్డు చేస్తున్న పోలీస్ సిబ్బందిని బూతులు తిట్టాడు. ఫోన్ ధ్వంసం చేసి దాడి చేయడంతో వారికి గాయాలయ్యాయి. ఎస్‌బీ పోలీసుల ద్వారా ఉన్నతాధికారులకు విషయం తెలియడంతో వారు తీవ్రంగా పరిగణించారు. వారి ఆదేశాల మేరకు రవినాయక్‌పై కేసు నమోదు చేసినట్లు సమాచారం. కాగా దాడి చేసిన వ్యక్తిపై అక్రమ ఆయుధ చట్టం కింద గతంలోనే కేసు నమోదు అయినట్లు తెలిసింది. ఈ విషయంపై ఎస్ఐ ఎల్లాగౌడ్‌ను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

దుర్గమ్మకు ఇంటింటి బోనం

దుర్గమ్మకు బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

రుద్రంగి, అక్టోబర్ 6: శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని మహాలక్ష్మి వీధిలోని దుర్గమ్మకు మహాలక్ష్మి యూత్ ఆధ్వర్యంలో ఇంటింటి బోనం తీసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలు తీసుకెళ్లి దుర్గమ్మకు నైవేద్యం సమర్పించారు. ఇక్కడ నాయకులు, మహిళలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

గంభీరావుపేట: బతుకమ్మ సంబురాలలో రెడ్డి సంఘ మహిళలు

ఘనంగా అట్ల బతుకమ్మ వేడుకలు

వేములవాడ టౌన్, అక్టోబర్ 6 : జిల్లాలో ఐదో రోజు అట్ల బతుకమ్మ సంబురాలు ఘనంగా కొనసాగాయి. అందంగా అలంకరించిన పూలతో బతుకమ్మలను తయారుచేసి ఉద్యోగులు, విద్యార్థినులు ఆదివారం వేములవాడ రాజన్న ఆలయ ప్రాంగణంలో సంతోషంగా ఆడిపాడారు. తీరొక్కపూలతో తయారుచేసిన బతుకమ్మలతో ఆలయ ప్రాంగణం శోభాయమానంగా విరాజిల్లింది. మహిళలు రాగయుక్తంగా బతుకమ్మను గౌరవిస్తూ, కీర్తిస్తూ బతుకమ్మ ఆడారు. అనంతరం ఆలయ ధర్మగుండంలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

కోనరావుపేట, అక్టోబర్ 6: మండలంలోని వట్టిమల్ల గ్రామంలో గౌడ కుల సంఘం అధ్వర్యంలో బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు తీరొక్క పూలతో రంగు రంగుల బతుకమ్మలను పేర్చారు. అనంతరం ఎల్లమ్మ దేవాలయం ఆవరణలో బతుకమ్మలను ఉంచి బతుకమ్మ ఆడారు. ఊరంతా బతుకమ్మ వేడుకలో పాల్గొన్నారు.

గంభీరావుపేట, అక్టోబర్ 6: మండల కేంద్రంలోని రెడ్డి సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. సంఘ ఆవరణలో మహిళలు సామూహికంగా తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చారు. అనంతరం ఆటపాటల మధ్య ప్రధాన కూడళ్లలో బతుకమ్మ ఆడుతూ చెరువులో నిమజ్జనం చేశారు.


కోనరావుపేట: వట్టిమల్లలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

నంది గరత్మంతుని వాహనంపై అమ్మవారి విహారం

వేములవాడ టౌన్, అక్టోబర్ 6 : శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో ఆదివారం రాత్రి ఉత్సవమూర్తులు, అమ్మవారిని నంది గరత్మంతుని వాహనంపై ఉంచి ఆలయ అర్చకుల వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య పురవీధుల గుండా విహరింపజేశారు. నవరాత్రోత్సవాల్లో నాగిరెడ్డి మండపంలో ప్రతిష్ఠించిన అమ్మవారు కూష్మాండ అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు రాత్రి అమ్మవారికి చతుష్షష్ట్యోపచార పూజలు నిర్వహించిన అనంతరం భక్తలోకాన్ని సమ్మోహనపరుస్తూ దివ్యమంగళరూపంతో శ్రీ పార్వతీ రాజరాజేశ్వరస్వామివారిని,శ్రీ లక్ష్మీ అనంత పద్మనాభస్వామివారిని, ఉత్సవమూర్తులను పెద్దసేవపై ఉంచి ఊరేగిస్తుండగా, తన దర్శన భాగ్యం కోసం